# అన్వేషణ

రచన:
శ్రీ ఘట్టి కృష్ణమూర్తి

(గత సంచిక తరువాయి)

స్నేహితులన్న మాటలు తనకు వరలక్ష్మి మీద కొండంత అనుమానం కలగజేస్తున్నాయ్.

అసలు ప్రపంచలో నిత్యమూ జరిగే నిజపరిస్థితినే వాళ్లు చెప్పారేమో...?. అయినప్పటికీ తనకు కూడ అందులో భాగస్వామిత్వమున్నట్లు మనస్సు ఒకమూల శంకిచుతూనే వున్నది. కలవరం చెందుతూనే వున్నది. తనకు తాను ఇపుడే కల్లోలంగా వున్న మనస్సుకు ఏదో వొక సమాధానం చెప్పుకోవాలి. ఇందులో తనకేమీ సంబంధం లేదని తృప్తిపడాలి. కాని, మనస్సు ఎంతవరకూ ఏదో వొక సందేహాన్నే కలగజేస్తోంది. నిర్ణయించుకోలేని ఏదో వొక కార్యభారం తనమీద పడినట్లున్నది.

వాళ్ళ కాపురం ఎలావుంటుంది అని ఇందాక వాళ్ళడిగిన మాట ఇంకా చెవుల్లో గింగురుమంటూనే వున్నాయ్. "చాల అన్యోన్యంగా వుంటుందని వాళ్లకు సమాధానం చెప్పివుంటే బాగుండేదేమో కాని, అతడు ఏంచేస్తాడు అని అడిగిన మరీ ప్రశ్నకు వాళ్ళే చెప్పిన సమాధానం మాత్రం చాల దారుణంగా వున్నది. అన్యోన్యత అనేది వాళ్ల సంసారంలో వుంటే వాళ్లు యిలా యెందుకు చెప్పాలి. చదువుకున్న భార్యను చేసుకున్న ప్రతివాడూ ఇలా చేస్తాడనే వాళ్ల గట్టినమ్మకమేమో... ఐనా వరలక్ష్మిలా సంతోషంగా కాపురం చేస్తున్న భార్యలు ఎంతమంది లేరు? ఏమో వాళ్ళంతా తన భార్యలా చదువుకోలేదేమో... ఇద్దరి మధ్యా ఒక అఘాతం వుంటుంది కావున్ను. ఒకరి మనస్సును మరొకరు అర్థం చేసుకోలేరు కావున్ను. అన్యోన్యత అంటూ వాళ్ల జీవితంలోనే చూడలేదు కావున్ను. ఇదంతా యదార్థమే అయితే అతడు తప్పకుండా లేచిపోతాడు కాని, తనకిలాంటి సంఘటన ఇంతవరకూ జరగలేదు. అదంతా తనకే అన్వయించుకుని బాధపడటం దేనికి?

సీతారాముడు ఎన్నివిధాల ఆలోచించినా, ఒక నిశ్చయానికి రాలేకపోయాడు. ఆ మాటలు అతని హృదయానికి ఇంత పరితాపము నెందుకు కలుగజేసినాయో...

* * *

విజ్ఞానం ఎవరిసొత్తు, నిజంగా తనకంటె వరలక్ష్మి విజ్ఞానవంతురాలే కావచ్చు. అంతమాత్రం చేత ఆమెమీద తనకంటె అసూయ యెందుకు కలగాలి? నిజంగా వరలక్ష్మి తనకంటె విజ్ఞానవంతురాలు అనే నమ్మకమున్ననాడు ఆమె దగ్గర తనెన్ని విషయాలనైనా గ్రహించవచ్చు. నేను పురుషుడను, విజ్ఞానమంతా నా సొత్తే అనే దురభిమానం తనలో తలెత్తుచున్నన్నాళ్లూ తనకే ప్రకృతంతా విరుద్ధంగానే కనబడుతూంటుంది. తనేమీ చెయ్యలేడు. ఆ దురభిమానానికి లోనైతే జీవితంలో ఎన్నడూ కనలేవు. దుస్సంఘటనల పాలౌతాడు. ఊ... హు... అంత మాత్రం స్థాయి తనకెక్కడుంది? అసమర్థత తనది అని తెలుసుకున్న తరువాత ఏమీ చెయ్యలేక అనవసరపు కోపానికి లోనౌతాడు. ఎదుటి వ్యక్తి తనకు భార్యయే కానీయండి, ఆమెతో ఎలాటి అనందమునూ అనుభవించలేక పోతాడు. అది అభిమానమే ఐతే ఇంతకంటె ఉన్నతస్థానాన్ని అందుకోటం కొరకు ప్రయతించుతాడు. ఇది తన జన్మహక్కు అనే దురహంకారానికిలోనైతే అధఃపతనం తప్పదు. విజ్ఞానం పొందుతున్న వాళ్లకు ఎన్నడూ అడ్డు నిలకలేదు,

విచారించుతున్నకొద్దీ తనలో ఏదో వొక అభిమానం తలెత్తింది. తనముందు పెద్ద అఘాతం వున్నట్లున్నది. అడుగువేస్తే ఆ అంతులేని అగాధంలో పడిపోతాడేమో... జీవితంలో తనెలాటి ఆనందమునూ అనుభవించలేడేమో... నిజంగా చదువుకున్న భార్యను చేసుకోనటం తప్పేనేమో అని తోచినప్పుడు ఏమీ సమాధానం చెప్పుకోలేక వల్లోపడిన చేపలాగు కొట్టుకుంటుంది తనని మనస్సు.

ఇప్పుడు తనేం చెయ్యాలి ? వాళ్లు అన్నమాట శల్యంలా హృదయంలో బాధించుతున్నా తగినట్లు సమాధానం చెప్పుకుని, ఆ బాధను ఎంతమాత్రమూ నివారించుకోలేకపోయినాడు. వాళ్లు నవ్వులాటకే అన్నారనుకో, ఐతే తనకంత బాధ ఎందుకుకలగాలి? పోనీ... అదే ప్రమాణంగా తీసుకుని తనుకూడ లేచిపోతే మరునాటినుంచీ వాళ్లే... తనని పిరికిపందా అంటారు. చేతకాని వెధవ అంటారు. ఆకళంకాన్ని మాపుకోవటం ఎలాగ ?.— వరలక్ష్మి చదువుల సరస్వతి. తను నిజంగా చూసుకుంటే అంత విజ్ఞానం నేటికీ సంపాదించలేకపోయినాడు. కాని వరలక్ష్మి తనని ప్రేమిస్తున్నది, తన్ను గౌరవం మర్యాదగా పూజ్యభావంతో చూస్తున్నది.... ఇప్పుడు అర్థంతరంగా ఏదో వొక నిందమోపి తను ఇంట్లో నుంచి లేచిపోతే— అసలీ పనిని ప్రపంచమే అంగీకరించదు. ఏదో వొక నిందమోపి వరలక్ష్మినే తను వొదిలిపెడితే...... "ఛీ... దుర్మార్గుడా, వరలక్ష్మి నీకు భాగ్యదేవత, నీ అసమర్థతవల్ల ఆమెను చెడుగా శంకించుతున్నావ్. నీవీ జన్మలో చచ్చావన్నమాట. నిప్పును శంకిస్తున్నావ్ " అని ఆకాశంలో బిగ్గరగా ప్రతిధ్వనించినట్లయింది. ఉలికిపడి గాభరాగా వెనక్కు తిరిగి చూశాడు. కడుపులో ఏమిటో గుబులు గుబులుగా బయలు దేరుతుంది... తను మన్సులో వరలక్ష్మిని గురించి చెడుగా శంకించాడు. ఏదో పెద్ద తప్పుచెప్పిన వాడిలా భయపడతాడు. తనవెనకో శిక్షించుతున్నట్లు కనపడుతుంది. తను శంకిచ్చినట్లుగా వరలక్ష్మిలో పిసమెత్తైనా లోపం వున్నదని నిరూపించటానికి వీలులేదు, అనుకున్నాడు... తన భార్యనుగురించి తనే అంతగా శంకించటమా?... ఏం తనలో... అంతమాత్రం మానవత్వంనశించిందా? ఇన్నాళ్ళనుంచీ కాపరంచేస్తుంటే వరలక్ష్మి మనస్సు ఎటువంటిదో గ్రహించాలా?......గ్రహించాడు. వరలక్ష్మి తనవెలాంటి భావంతో చూస్తున్నదీ తన అంతరాత్మయే మాటిమాటికి సాక్ష్యమిస్తున్నది. ఇప్పుడు స్వార్థం కోసరం ఏదో వొక బూటకొన్ని పన్ని పిడుగులా ఆవిడమీద విసరటం ఎలాగు ?. వరలక్ష్మి నిజంగా ఎంత బాధపడుతుందో... కాదు కాదు... వరలక్ష్మి ఎన్నటికీ నిష్కళంక అని మనస్సులో నిశ్చయించుకున్నాడు.

తనెన్నివిధాల ప్రయత్నించినా, యోచించినా స్వతంత్రించి ఏమీ సమాధానం చెప్పుకోలేకపోయినాడు సీతారాముడు. ఇంటికి వొచ్చినదగ్గరనుంచీ తను వరలక్ష్మిని మామూలు దృష్టితో చూడలేకపోయినాడు. తనకో పెద్దపులిలా కనబడుతుంది వరలక్ష్మి. ఏమాటా మనసువిప్పి సరిగా మాట్లాడడు. మనిషిని చూస్తేనే తల ప్రక్కగా తిప్పుకుని మరోవైపుకు పోతాడు. ఏ మడిగినా సరిగా సమాధానం చెప్పడు...... వినుగ్గావుంటాడు. ఇదిఅంతా చూచి ఏమిటో అనుకున్నది వరలక్ష్మి. కొంతసేపు ఇంట్లో వుండకుండా బయటికిపోతాడు......అరుగుమీదకు వచ్చి కూచుంటే తన్నెవరో పరిహసిస్తున్నట్లు కనపడుతుంది. వెనక్కు తిరిగిచూసి అనవసరంగా వరలక్ష్మి మీద కోపగించుకొంటాడు.—కొంతసేపు అలాగే విచారించుతూ కూచున్నాడు. తన చేతకానితనంవల్ల అసమర్థతవల్ల కలిగిన యీ మనఃప్రవృత్తికి దాసుడై అది చెప్పినట్లు బుద్ధినిమార్చుకుని తోచినట్లల్లావూహించటం మొదలుపెట్టాడు......

కొంతసేపటికి......ఏమండీ అలా కూర్చున్నారేం ? ఏమిటలా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు ?... అన్నది దగ్గరగా కూర్చుని వరలక్ష్మి. తన మొహంలోకి చూస్తూ......ఒక్కసారి ఆవిడ మొహంవంక చూశాడు సీతారాముడు.........తను భావించు

తున్నట్లు తనను ఆక్షేపిస్తున్నట్లుగాని, తన్ను తేలికగా చూస్తున్నట్లుగాని వరలక్ష్మి మొహంలో కనపించలేదు. తనిలా ఎందుకు కూర్చున్నాడో అనే ఆగుర్దామాత్రం ఆవిడ ముఖంలో కనుపించింది. తన మనస్సుకు ఒకటేనిశ్చయం చేసుకున్నాడు. వరలక్ష్మి మనసులోకూడా తన్ను గురించి ఏమీ అనటంలేదు తన్ను తేలికగాచూడటంలేదు అని. ఇదివరకు తనకు కలిగిన కోపం, విసుగు అన్నీ మాయమైనాయ్ కాని వరలక్ష్మి ప్రక్కన కూర్చుంటే ఏమిటో దెంచుకుపోతున్నానా, అనుకున్నాడు. వరలక్ష్మి తన కంటె ఎత్తు పెరుగుతోందా? కాదు. తనకంటె విజ్ఞానం ఎన్నడో సంపాదించుకున్నది. ఆ విజ్ఞానమే ఆవిడకు ఔన్నత్యాన్నిచ్చింది. తన మనస్సుకే ఉన్నతమైనదిగా కనుపించుతున్నది. తను దీపంముందర దివిటీ......

అయినా ఇప్పుడు కొంత సద్భావంతో వరలక్ష్మిని అర్థంచేసుకొనటం మొదలుపెట్టాడు. ఇంతకు ముందెన్నడూ తన మనస్సులో ఇలాంటి విచారం కలుగలేదు. అందుకని వరలక్ష్మి తనకంటె చదువుకున్నదని తనకు తెలిసినా, ఆమె విజ్ఞానాన్నిగురించి ఇంతగా విచారించవలసిన అవసరం ఎన్నడూ కలుగలేదు. ఇప్పుడు తనలోలేకెత్తిన అసహనాన్ని అంతా అణచుకుని సద్భావంతో ఒక్కక్షణం వరలక్ష్మిని గురించి విచారించేసరికి ఒక్కసారి ఆమెముఖంవంక చూచేసరికి తెర తెంచినట్లు అంతా సరిగా అర్థమయింది......ఏమీలేదు......అన్నాడు తెచ్చిపెట్టుకున్ననవ్వుతో......మరేమిటి. అలా డీప్‌గా ఆలోచిస్తున్నారు, వరలక్ష్మి మళ్ళీ అతనిమొహంలోకి పరీక్షగా చూస్తూ అడిగినమాటకు ఏం చెప్పాలో అతనికి తోచలేదు. మాట తడబడ్డాడు. ఎదురుగుండా వరలక్ష్మి కూచునుంటే, తన్నిఅడుగుతుంటే అబద్ధమెలా ఆడేది, అనుకున్నాడు. ఏదో పెద్ద తప్పుచేసిన వాడిలా మనస్సులో భయపడ్డాడు. ఇంకేమీ వరలక్ష్మితో మాట్లాడలేకపోయినాడు.—నేనుఅలస్యంగా వస్తాను కాని నువ్వువెళ్ళి పడుకో అని చెబుతూ చివాల్న అరుగుమీదనుంచి లేచిపోయినాడు. వరలక్ష్మికి ఇదేమిటో అర్థంకాలేదు. సీతారాముడి ప్రవర్తనచూస్తే మొత్తంమీద విచిత్రంగానే కనబడుతున్నది. ఎందుకో ఇలావున్నారు? అనుకున్నది. తొందరగారండిఅన్నమాట అతనికి వినపడిందో లేదో.

వరలక్ష్మి వెళ్ళి పడుకున్నది. ఏమీతోచక కొంతసేపు షేక్స్పియర్ డ్రామా చదువుకున్నది. ఎంతసేపు చూసినా సీతారాముడు ఇంటికిరాడు. మాటిమాటికీ నాలుగైదుసార్లు వాకిట్లోకివొచ్చి చూసింది. ఎక్కడ వెళ్ళాడు...ఎంతసేపటికీ రాడు. ఏమిటో ఆలోచిస్తూ పడుకునుండగానే కునుకు పట్టింది. తరువాత ఏం జరిగిందో వరలక్ష్మికి తెలియదు—

సీతారాముడు అక్కడనుంచి సరాసరి బజారు పోయినాడు. ఇంకా తనవెనుక ఎవరో పగలపడి నవ్వుతున్నట్లే తనని ఆక్షేపిస్తున్నట్లే అతని భావన. ఎవరో ఎరుగున్నవాళ్ళు రాచుకుపోతున్నా దారిలో పలకరించలేదు. ఏదో వొక లక్ష్యంకొరకు నడిచి వెడుతున్న వాడిలా గబగబా వెళ్లిపోతున్నాడు సీతారాముడు—

కొంతసేపటికి వెనక్కు తిరిగి సినిమాకువొచ్చి కూచున్నాడు. అయినా తనమనస్సును ఏదో కలవరపెడుతూనే యున్నది. తన్నింతగా వ్యాకులపరుస్తున్నశక్తి ఏదైనా వున్నదేమో......అలాకూచుని ఏమిటో ఆలోచిస్తుండగానే లైట్లుఆరినాయ్. ఆట ప్రారంభమైంది. ఏవో బొమ్మలు కొన్ని ఆడుకుంటున్నాయ్. కొన్ని నవ్వుకుంటున్నాయ్. మరికొన్ని జంటలు జంటలుగా తిరుగుతున్నాయ్. వాటిని బొమ్మలుగానే గ్రహించకలిగాడు సీతారాముడు.

వాటిలో ఎలాటి విశిష్టతా, తనకు కనపడలేదు. నవ్వే బొమ్మల్నిచూసి తనని చూసే నవ్వుతున్నాయ్ అనుకున్నాడు. చెట్టాపట్టాలు పట్టుకుని జంటలు జంటలుగా ఎగిరే బొమ్మలు ఆదర్శ దంపతులుగా సుఖాన్ననుభవించుతున్నట్లు కనపడినాయ్.

(సశేషం)